క్లుప్తంగా

రేపు ఉప్పలపాడులో గడపగడపకూ..

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



కామరాజుపేటలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామ్‌గోపాల్

గోకవరం: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్ సూచించారు. మండలంలోని కామరాజుపేట ఎర్రమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతదారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించిన వేతనాలు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. అనంతరం గోకవరం ఉపాధిహామీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీఓ పీఎస్ అప్పలరాజు, జేఈ అమూల్య రత్నరాజు, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన

తొండంగి: మండలంలో ఎ.కొత్తపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ సూచనల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ సభ్యులు సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ సంస్థ సూపర్‌వైజర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందజేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సంస్థ కార్యదర్శి అప్పారావు, ప్రకాష్‌రావు, మహిళా పోలీస్ వీరలక్ష్మి, వీఆర్వో సుభాషిణి, సూర్యామణి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన



సూరంపాలెం ఆదిత్యలో పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ నెల 22న ఎస్‌సీటీపీసీఎస్ ప్రిలిమ్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం పరీక్షా కేంద్రాలను కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.శ్రీనివాస్ పరిశీలించారు.సుమారు 11,500 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరిలో 2197 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారని, వీరిని తనిఖీ చేసేందుకు సబ్ డివిజన్‌లోని మహిళా పోలీసులను నియమిస్తున్నట్టు తెలిపారు. బందోబస్తు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయా కళాశాలల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పెద్దాపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తొండంగి, కృష్ణాపురం, పి.అగ్రహారం, ఒంటిమామిడి, దానవాయిపేట పరిసర గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అంబేడ్కర్ నూతన విగ్రహం ఏర్పాటు

కిర్లంపూడి: స్థానిక హరిజనపేటలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ గతంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తామని తెలిపారు.

సేంద్రియ సాగుకు ఊతం

- గ్రామాల్లో జోరుగా వర్మీ కంపోస్టు తయారీ
- రైతులకు తక్కువ ధరకే విక్రయాలు
- సేంద్రియ సాగుకు మేలు



వి.కొత్తూరులోని వర్మీ కంపోస్టు తయారీ యూనిట్



ఫిట్స్‌లో కంపోస్టు తయారీకి వానపాములను వేస్తున్న కార్మికులు

తుని రూరల్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నారు. ఈ కంపోస్ట్ ఎరువు రైతులకు అందుబాటులోకి వస్తుండడంతో సేంద్రియ పంటల సాగుకు ఊతం లభించనుంది. ఈ వారంలో అన్ని మండల పరిషత్ కార్యాలయాల పరిధిలో వర్మీ కంపోస్టు విక్రయాలు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో వర్మీ కంపోస్టు విక్రయాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

70 రోజుల్లో..

ఇప్పటికే వర్మీ కంపోస్టు తయారీకి చెత్త నుంచి సంపద కేంద్రాల ఫిట్స్‌లో వానపాములను వేశారు. 70 రోజుల్లో వానపాముల విసర్జిత వ్యర్థాలతో వర్మీ కంపోస్టు తయారవుతుందని అధికారులు పేర్కొన్నారు. రసాయన ఎరువుల వాడి సాగు చేసిన పంటల కంటే వర్మీకంపోస్టు వినియోగంతో పండించిన పంటలు ఎంతో ఆరోగ్యవంతం. దీంతో సాగులో పూర్వపు పద్ధతులతో ఆర్గానిక్ ఉత్పత్తులను పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి.

ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

పూర్వం ప్రకృతి సహజ పద్ధతులు ద్వారా సాగు చేయడం వల్ల ఆ ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్న మనుషులు ఎంతో ఆరోగ్యంగా, బలంగా ఉండేవారు. అధికోత్పత్తుల లక్ష్యంగా రసాయక ఎరువులు, పురుగు మందులు వాడకం దశాబ్దాల క్రితం మొదలు పెట్టారు. రసాయక ఎరువులు, పురుగు మందులను అధిక మోతాదులో వాడడం వల్ల కాలక్రమంలో ఎన్నో అనార్థాలు, ఆరోగ్య సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థలతో పాటు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆర్గానిక్ ఆహార ఉత్పత్తులను ప్రోత్సహిస్తోంది. దీంతో ఆర్గానిక్ ఆహార ఉత్పత్తుల (సేంద్రియ సాగు) సంవత్సరంగా 2023ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను రైతులకు చేర్చడంతో పాటు సురక్షితమై సహజ పద్ధతులు ద్వారా తయారు చేసే వర్మీకంపోస్టును రైతులకు తక్కువ ధరకే అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారీకి శ్రీకారం చుట్టారు. అలా తయారు చేసిన వర్మీకంపోస్టును మండల కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండేవిధంగా విక్రయాలను చేపట్టారు.

ఐదు కేంద్రాల్లో ఉత్పత్తి

తుని మండలంలో వర్మీ కంపోస్టు తయారీకి 70 రోజుల కిందటే బీజం పడింది. వి.కొత్తూరు, రాపాక, దొండవాక, కేఓ మల్లవరం, ఎస్ఎస్‌వీ నగరంతో పాటు కోటనందూరు, తొండంగి మండలాల్లోనూ వర్మీకంపోస్టు తయారీ ప్రారంభమైంది. ఆయా కేంద్రాల్లో తయారయ్యే వర్మీకంపోస్టును విక్రయించేందుకు రెండు, ఐదు కిలోల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కిలో వర్మీ కంపోస్టు రూ.8 నుంచి రూ.10 వరకూ విక్రయించనున్నారు. ఉద్యాన, వ్యవసాయ పంటలైన పూలతోటలు, పండ్లతోటలు, పెరట కూరగాయలు, ఖరీఫ్, రబీ పంటలకు, భూసారం పెంపునకు వర్మీకంపోస్టు వాడకం ఉత్తమం.

తక్కువ ధరకే విక్రయిస్తాం



జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాల మేరకు వర్మీ కంపోస్టు విక్రయాలకు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నాం. వర్మీ కంపోస్టు తయారీకి వానపాములను ఫిట్స్‌లో వేశాం. పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో తయారీ, విక్రయాలు జరుగుతాయి. దీంతో రైతులకు తక్కువ ధరకే వర్మీకంపోస్టు లభ్యం కానుంది. వర్మీకంపోస్టు విక్రయ దుకాణాలతో రైతులకు శ్రమతగ్గి, పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయి.

\- ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, ఎంపీడీఓ, తుని

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



స్టాపర్ బోర్డులు అందించిన రఘురామ ఆసుపత్రి అధినేతలతో పోలీసులు

ప్రత్తిపాడు: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్టు ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు తెలిపారు. పెద్దాపురం ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు సూచనల మేరకు అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ఆయా ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు బుధవారం స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక రఘురామా ఆసుపత్రి అధినేతలు ఐఏ రఘురామ్, బి.శారదాదేవి తదితరులు సహకారంతో ఈ స్టాపర్ల బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వాహన చోదకులు, ప్రయాణికులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్సై కె.సుధాకర్, ఏఎస్సై కె.సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించండి

శంఖవరం: ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు కోరారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా కత్తిపూడి జాతీయ రహదారిపై బుధవారం స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్ఐ శోభన్‌బాబు, పోలీసులు పాల్గొన్నారు.

చెట్లు తొలగించేందుకు బహిరంగ వేలం



నగర పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణం నిమిత్తం అడ్డంగా ఉన్న చెట్లను తొలగిస్తున్నట్టు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ కె.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపునకు బహిరంగ వేలం నిర్వహించారు. సుమారు 54 మంది పాల్గొనగా హెచ్చు పాటదారుడు రూ.1.38 లక్షలకు పాడుకున్నాడు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని యర్రవరం రోడ్డు, నర్సీపట్నం రోడ్డు, లింగపర్తి రోడ్డు, పాత అడ్డతీగల రోడ్లను అనుకుని రూ.2 కోట్లతో డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. దీని నిమిత్తం అడ్డంగా ఉన్న చెట్లను తొలగిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, యండగండి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కళాధర్‌రెడ్డి

గోకవరం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే పీఎంపీలు దోమకాటు జ్వరాల (వైరల్ జ్వరాలు)పై అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరానికి చెందిన ఫస్ట్ ప్లస్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ బీఆర్ కళాధర్‌రెడ్డి సూచించారు. స్థానిక బావాజీపేట గ్రామ శివారున బుధవారం పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు పి.చిన్ని ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ కళాధర్‌రెడ్డి మాట్లాడుతూ మలేరియా, డెంగీ వంటి దోమకాటు జ్వరాలను గుర్తించే విధానం, ప్రాథమిక చికిత్స తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా కార్యదర్శి బళ్ల శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎన్‌టీఆర్



ఏలేశ్వరంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

తుని/గోకవరం/ఏలేశ్వరం/జగ్గంపేట/ప్రత్తిపాడు/గండేపల్లి/కోటనందూరు: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు వర్ధంతిని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించారు. స్థానిక గొల్ల అప్పారావు సెంటర్లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. గోకవరం రాణా సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరం మెయిన్‌రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్రకార్యదర్శి పైల సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. గండేపల్లి మండలంలోని మురారి, తాళ్లూరు, ఎన్టీ రాజాపురం గ్రామాల్లోని ఎన్‌టీఆర్ విగ్రహాలకు టీడీపీ మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటనందూరు మండలంలోని కేఏ మల్లవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు.

రక్తదానం శిబిరాలు

జగ్గంపేటలో ఎన్‌టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 173 మంది టీడీపీ శ్రేణులు రక్తదానం చేశారు. కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ దాతల నుంచి రక్తాన్ని సేకరించింది. ప్రత్తిపాడు టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజా ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని వరుపుల రాజా ప్రారంభించారు. సుమారు 200 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గుమ్మరేగులలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- ఉప్పంపాలెం, గుమ్మరేగులలో గడపగడపకూ..

రౌతులపూడి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉప్పంపాలెం, గుమ్మరేగుల గ్రామాల్లో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, డ్రైన్లు, రోడ్లు నిర్మించాలని, విద్యుత్, తాగునీరు, వీధి లైట్లు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైస్ ఎంపీపీ వాసిరెడ్డి లక్ష్మీభాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచులు యెనుముల కోటేశ్వరరావుదొర, రాపర్తి రామకృష్ణ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ నాయకులు ప్రసాద్, సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రౌతులపూడి: రౌతులపూడి-కొట్టాం రహదారిలో రాజవరం వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటనందూరు మండలం చిన్నయపాలెం నుంచి రాజవరం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న రాజవరం గ్రామానికి చెందిన కంటిపాము విజయబాబు, కాపు చంటిబాబు, ఏడిద కుమార్‌బాబు కోటనందూరు వైపు వెళ్తున్న రెండు ఖాళీ ట్రాక్టర్లను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వారు ముగ్గురు, ట్రాక్టర్ డైవర్ పైల దొరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చికిత్స కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని కోటనందూరు పోలీసులు తెలిపారు.

భూ సర్వేను వేగవంతం చేయాలి

శంఖవరం: గ్రామాల్లో చేస్తున్న భూ సర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం సిబ్బందిని ఆదేశించారు. కత్తిపూడి సచివాలయంలో భూముల రికార్డులను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూ విస్తీర్ణానికి సంబంధించిన మార్పులు, చేర్పులపై సమగ్ర పరిశీలన జరిపి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న డ్రోన్ సర్వేపై సర్వే సిబ్బందిని ఆరా తీశారు. వీలైనంత త్వరగా రీ సర్వే పనులను పూర్తిచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో వీఆర్‌ఓ శ్రీనివాస్, సర్వేయర్‌పాల్గొన్నారు.

21న పురందర దాసు ఆరాధనోత్సవం

కాకినాడ కల్చరల్: శాస్త్రీయ కర్ణాటక సంగీతానికి ఇంతటి ఔన్నత్యం ఏర్పడడానికి పితామహుడైన పురందర దాసు ఆరాధనోత్సవాన్ని ఈనెల 21వ తేదీ సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్య కుమారి బుధవారం తెలిపారు. స్థానిక సర్పవరంలోని నారద కుండం వాగ్గేయకార మండపంలో శనివారం శ్రీలక్ష్మిమహావిష్ణు భజన మండలి(పెద్దాపురం) సభ్యులతో పురందర దాసు కీర్తనల గానం చేస్తారని ఆమె తెలిపారు. సంగీత , సాహిత్యానికి ఎనలేని సేవలు చేసిన పురందరదాసు ఆరాధనోత్సవానికి సంగీత విద్వాంసులు, వారి శిష్యులు, భక్తులు హాజరుకావాలని ఆమె కోరారు.

రైతుబజారు నిర్మాణానికి రంగం సిద్ధం



తుని మార్కెట్ యార్డులో రైతు బజారు నిర్మించే స్థలం

- రూ.70 లక్షలు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభం

తుని: పట్టణంలో రైతు బజారు నిర్మాణానికి రంగం సిద్ధమైంది. రైతులు, ప్రజలకు త్వరలోనే రైతు బజారు అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్లుగా రైతు బజారు కోసం ప్రభుత్వాలు ప్రయత్నాలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ఎట్టకేలకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషి ఫలితంగా మార్కెటింగ్ శాఖ అనుమతి ఇవ్వడంతో పాటు రూ.70 లక్షలు మంజూరు చేసింది. ఇటీవల మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత రైతు బజారుకు శంకుస్థాపన చేశారు. త్వరలోనే పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఇదీ పరిస్థితి

తుని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రస్తుతం రైతుల పండించిన పంటల క్రయవిక్రయాలు జరగడం లేదు. దీంతో ఉన్న స్థలాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలని మార్కెటింగ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. గోడౌన్లు, దుకాణాలను హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. దీని ద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం వస్తోంది. ప్రస్తుతం రోడ్లపై నిర్వహిస్తున్న రైతు బజారుకు శాశ్వత నిర్మాణం చేపట్టాలని తీసుకున్న నిర్ణయం ఫలప్రదమైంది. తుని, ప్రత్తిపాడు, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలో కూరగాయలు పండించే రైతులు నేరుగా పండించిన సరకును వినియోగదారులకు అమ్ముకునేందుకు వీలుగా రైతు బజారును నిర్మిస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేశామని, త్వరలో పనులు చేపడతామని ఆయన వివరించారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

జగ్గంపేట: విద్యుత్ చార్జీల పెంపుపై స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయంలో గురువారం నుంచి ఈ నెల 21 వరకూ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు స్థానిక ట్రాన్స్‌కో డీఈ రత్నాలరావు బుధవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) సభ్యులు విశాఖపట్టణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారన్నారు. తమ అభిప్రాయాలు తెలిపాలని భావించే వారు జగ్గంపేట డీఈ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని కోరారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

తుని: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) విద్యుత్ చార్జీలపై గురువారం నుంచి 21 వరకూ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ట్రాన్స్‌కో పర్యవేక్షణ ఇంజనీర్ టీవీఎస్ఎన్ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా శ్రీను



అన్నవరం: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా స్థానిక న్యాయవాది బొడ్డు శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లికాయల శంకరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా నూతన అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గుల పోటీలు



శరభవరంలో సంక్రాంతి ముగ్గు వేస్తున్న యువతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శరభవరంలో బుధవారం ఉలుసు బ్రదర్స్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల రంగవల్లలు వేశారు. సంక్రాంతి ప్రాముఖ్యతను తెలిపేలా వేసిన ముగ్గులు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

వైభవంగా బాలయోగి మెట్ట తీర్థం



తీర్థంలో సందర్శకుల సందడి

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరి సమీపంలోని బాలయోగి మెట్ట తీర్థం బుధవారం వైభవంగా జరిగింది. కొండపై ఉన్న ఆలయంలో బాలయోగి విగ్రహాన్ని వందలాది మంది సందర్శించారు. కొండను ఆనుకుని ఉన్న ఆర్ అండ్ బీ రహదారిపై తీర్థం జరిగింది. ఆ పక్కనే రైలుపట్టాలు ఉండడంతో ఎటువంటి ప్రమాదం సంభవించకుండా రూరల్ ఎస్సై ఎ.బాలాజీ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలని వినతి



నగర పంచాయతీ కార్యాలయంలో ఎస్సీలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత చలమయ్య

ఏలేశ్వరం: స్థానిక మందుల కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని ఎస్సీలు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వాడపల్లి శ్రీను ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేత అలమండ చలమయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ సమస్యను ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి మున్సిపల్ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దిలబర్ హుస్సేన్, అలమండ మధు, వాడపల్లి సత్యం , తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి గ్రామ శివారులో కోడి పందేల శిబిరంపై బుధవారం రాత్రి ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. కోడి పందేలాడుతున్న జూదరులు పరారయ్యారు. ఈ దాడిలో తొమ్మిది బైక్‌లు, రెండు కోడిపుంజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ల యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబు తెలిపారు.

కత్తిపూడిలో చోరీ

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో కచ్చర్ల వీరబాబు ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. అన్నవరం పోలీసుల కథనం ప్రకారం బాధితుడు వీరబాబు కుటుంబ సభ్యులతో కలిసి దైవ దర్శనానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో 6 కాసుల బంగారు ఆభరాలు, నగదు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.